

వైరుధ్యాలకు ఆలవాలం

శ్రీకాకుళం వైరుధ్యాలకు ఆలవాలంగా విలసిల్లుతోంది. ఈ జిల్లా ప్రత్యేకతలివే.

- 8లో



ప్రాణం తీసిన ఈత సరదా

ఈత సరదా ఓ బాలిక ప్రాణం తీసింది. హిరమండలంలో ఘటన జరిగింది.

- 8లో

ఐఎఫ్ఎస్‌కు కృష్ణచైతన్య ఎంపిక



నరుబుజ్జిలి: యూపీఎస్సీ ఫలితాల్లో మండలంలోని కూనజమ్మన్నపేట గ్రామానికి చెందిన సింగూరు కృష్ణచైతన్య ఇండియన్‌ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్)కు ఎంపికయ్యారు. ఈ ఫలితాల్లో ఆలిండియాలో 83వ ర్యాంకు సాధించాడు. కృష్ణ చైతన్య ప్రస్తుతం విశాఖపట్నం ఈపీఎఫ్ కార్యాలయంలో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈయన తండ్రి సింగూరు రంగనాయకులు ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. తల్లి మీనా కుమారి గృహిణి.

న్యూస్‌రీల్

కారులో నగదు పట్టివేత



కారును తనిఖీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : ఎన్నికల నేపథ్యంలో చేపడుతున్న తనిఖీల్లో భాగంగా బుధవారం విశాఖపట్నం నుంచి జిల్లా కేంద్రంలోకి ప్రవేశించే సింహద్వారం జాతీయ రహదారి వద్ద ఓ కారులో రూ. 1.03 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకున్నారు. కుశాలపురం గ్రామానికి చెందిన డి.రాజశేఖర్ తన కారులో పీఎన్‌కాలనీ వెళ్తుండగా ఎఫ్ఎస్‌టీ బృందం సింహద్వారం వద్ద తనిఖీల కోసం ఆపారు. నగదును పట్టుకునేటప్పుడు ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేసి తహసీల్దార్ సమక్షంలో ట్రెజరీకి అందజేశారు. రాజశేఖర్ వస్తువులు తాకట్టు పెట్టిన రశీదు మళ్లీ తేవడంతో జిల్లా కమిటీకి చూపించాలని అధికారులు సూచించారు.

జిల్లాలో పాలీసెట్ ఉత్తీర్ణత 88.09 శాతం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలీసెట్–2024 ఫలితాలను సాంకేతిక విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. జిల్లా నుంచి 10,891 మంది పరీక్షకు హాజరు కాగా, 9576 మంది ఉత్తీర్ణత సాధించారు. 88.09 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 6288 మంది బాలురకు 5452 మంది ఉత్తీర్ణత సాధించారు. 86.70 శాతం ఉత్తీర్ణత సాధించారు. 4583 మంది బాలికలకు 4124 మంది ఉత్తీర్ణత సాధించారు. 89.98 శాతం నమోదైంది. త్వరలో పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

112వ ర్యాంకు



అరవింద్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

నరసన్నపేట: పాలిసెట్ ఫలితాల్లో స్థానిక శ్రీ జ్ఞానజ్యోతి స్కూల్‌లో టెన్త్ చదివిన విద్యార్థి గొల్లంగి అరవింద రాష్ట్ర స్థాయిలో 112 వ ర్యాంకు పొందాడు. పోలాకి మండలం జిల్లోడుమాకివలసకు చెందిన అరవింద రైతు కుటుంబానికి విద్యార్థి. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం ప్రతినిధులు అరవింద్‌ను అభినందించారు.

మెరిసిన హర్షిత




ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని రెడ్డి క్వార్టర్స్‌కు చెందిన కూన హర్షిత పాలిసెట్‌లో 116 మార్కులు పొంది 115వ ర్యాంకు సాధించింది. విద్యార్థిని తల్లి జలజాక్షి ప్రభుత్వ ఉద్యోగిని కాగా తండ్రి కూన నాగు సప్లయర్స్ బిజినెస్ చేస్తుంటారు. ఈమెను శ్రీవాణీ హైస్కూల్ యాజమాన్యం బి. రమణమూర్తి, నారాయణ రావులు, తల్లిదండ్రులు అభినందించారు.

143వ ర్యాంకు



కోటబొమ్మాళి: కోటబొమ్మాళి గ్రామానికి చెందిన సకలాభక్తుల శ్రీవల్లి పాలిసెట్‌లో 143వ ర్యాంకు సాధించింది. శ్రీవల్లి తండ్రి శ్రీనివాసరావు ఓ చిరు వ్యాపారి. తల్లి పద్మాలక్ష్మి గృహిణి. కోటబొమ్మాళి ప్రభుత్వ హైస్కూల్‌లో శ్రీవల్లి 10వతరగతి చదువుకుని 595 మార్కులు సాధించింది. శ్రీవల్లిని ఎంఈఓ–1,2 ఎస్ అప్పలరాజు,లఖినేని విశ్వప్రతాప్,హైస్కూల్ హెచ్‌ఎం డబ్బీరు గోవిందరావు, గ్రామస్తులు అభినందించారు.

ఆ రోజులు మళ్లీ వద్దు బాబూ..



నాటి దుస్థితి

ఈ ఫొటో చూడండి. టీడీపీ హయాంలో విత్తనాల కోసం జి.సిగడాం మండలం పాలఖండ్యాంలో రైతులు క్యూలో నిలబడ్డ పరిస్థితి. కిలోమీటర్ల మేర విత్తనాల కోసం పడిగాపులు పడిన దృశ్యమిది.



నేటి పరిస్థితి



ఈ చిత్రం చూడండి. జి. సిగడాం ఎస్పీ ఆర్ పురంలో రైతు భరోసా కేంద్రం వద్ద విత్తనాలు అందజేస్తున్న దృశ్యం. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ముందే ఇండెంట్ తీసుకుని రైతులకు ఇలా విత్తనాలు అందజేశారు.

నాడు.. మూడు రోజులు లైను కడితే గానీ అందని ఎరువులు. ఆలి పుస్తెలు తాకట్టు పెడితే గానీ దొరకని విత్తనాలు. వ్యవసాయం దండగ అంటూ బాబు గారి వ్యాఖ్యానాలు. పంట అమ్మాలంటే దళారులే దిక్కు. పంటపై ప్రైవేటు వ్యాపారులదే హక్కు.

నేడు.. రైతుల కోసమే గ్రామానికో రైతు భరోసా కేంద్రం.. అన్నదాత మేలు కోసం భూసార పరీక్ష కేంద్రాలు.. కర్షకుడికి సాయంగా రైతు భరోసా పథకం. పంట పండితే మద్దతు ధర.. నష్టపోతే బీమా.. దళారుల బెడద లేకుండా ప్రభుత్వ అధికారులే పొలం వద్దకు వెళ్లి పంట కొనేలా చర్యలు.

అన్నదాతకు ఎవరు అండగా నిలిచారో ఈ ఐదేళ్ల కాలమే చెబుతుంది. ఐదేళ్లలో జిల్లాలో ఎక్కడా విత్తనాలు కోసం ఎవరూ లైను కట్టలేదు. ఎరువు కోసం క్యూలో నిలబడలేదు. పంట విక్రయానికి దళారులను వెతుక్కోలేదు. ఇదే టీడీపీకి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడా.

- నాడు రైతులను నిలువునా ముంచిన చంద్రబాబు
- వ్యవసాయం దండగ అంటూ చులకన చేసిన టీడీపీ
- నేడు అన్నదాతకు అండగా వైఎస్ జగన్
- రైతు భరోసాతో చేయూత
- రైతుల వద్దకే విత్తనాలు, ఎరువులు
- సకాలంలో పంట కొనుగోలు, చెల్లింపులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

తన పద్నాలుగేళ్ల పాలనలో అన్నదాతలను చంద్రబాబు హీనంగా చూస్తే.. ఐదేళ్ల పాలనాకాలంలో సీఎం వైఎస్ జగన్ రైతును రాజును చేయడానికి ప్రయత్నించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రైతులకు అన్ని విధాలుగా గుండెకోత కోశారు. ఒక్క బస్తా విత్తనాల కోసం రోజుల తరబడి, కిలోమీటర్ల మేర బారులు తీరిన దుస్థితి ఎదురయ్యేది. అప్పులు చేసి బ్లాక్‌లో కొనాల్సిన పరిస్థితి ఉండేది. అంతేనా.. చంద్రబాబుకు, కరువుకు అవినాభావ సంబంధం ఉండేది. 2015–16లో 18 కరువు మండలాలు, 2016–17లో 11, 2017–18లో 9కరువు మండలాలు అధికారికంగా ప్రకటించారంటే అప్పట్లో కరువు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

అన్నదాతలపై బాబు చిన్నచూపు

తనకు తాను విజనరీ అని చెప్పుకునే చంద్రబాబుకు అన్నం పెట్టే రైతులంటే ఎప్పుడూ చులకనే. ఇంకా చెప్పాలంటే హీనంగా చూసేవారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోగా ధాన్యం తరలించినందుకు గాను రవాణా చార్జీలు సైతం ఏ ఒక్క రైతులకు చెల్లించలేదు. జిల్లాలో ప్రధాన సాగునీటి వనరులైన తోటపల్లి, నారాయణపురం, మడ్డువలస ప్రాజెక్టులను గాలికొదిలేసింది. నీటి పారుదల శాఖ అధికారులు నీరు–చెట్టు పనుల మీద చూపించే శ్రద్ధ సాగునీటి ప్రాజెక్టుల మీద చూపించకపోవడంతోపాటు ఉన్న కాలువల్లో పూడికలు తీయకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పలేదు.

వైఎస్ జగన్ హయాంలో..




రైతు బాగుంటే రాజ్యం బాగుంటుందనే మాటను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిజం చేసింది. ఉన్న గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకల సేవలు అందించింది. సేద్యం సజావుగా సాగేందుకు ఏటా మూడు విడతల్లో రైతు భరోసాతో తోడ్పాటు అందించింది. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలను ఇంటి వద్దకే అందజేసింది. ఏ పంటకు ఏ తెగులు సోకిందో అక్కడి సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందించేలా చేసింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా అందించి ఆదుకుంది. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పించింది.

బాబు హయాంలో మోసాలెన్నో..

- బాబు హయాంలో కల్తీ ఎరువులతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- రైతులకు రుణ మయాఫీ చేస్తానని, తొలి సంతకం ఆ ఫైలు మీదే పెడతానని చెప్పారు. అయితే, ఐదేళ్ల కాలంలో మాఫీ జరగలేదు. ఈ లోపు వడ్డీ అసలు కంటే ఎక్కువైపోయింది. ఇక, రైతులకు పంట రుణాలు అందించలేదు. అంతకుమించిన రుణాలను రీషెడ్యూల్ చేశారే తప్ప కొత్తగా ఒక్కపైసా రుణమివ్వలేదు.
- ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా ముఖం చాటేశారు. 2015–16లో 18 కరువు మండలాలు, 2016–17లో 11, 2017–18లో 9కరువు మండలాలుగా ప్రకటించినా అధికారంలో ఉన్నంతసేపూ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు.
- జిల్లాలో 2లక్షలకు పైగా కౌలు రైతులుండగా కేవలం 18వేల మందికి మాత్రమే గుర్తింపు కార్డులిచ్చారు.
- టీడీపీ హయాంలో రైతులకు ధాన్యం రవాణా చార్జీలు ఇవ్వలేదు. జిల్లాలో రూ.82.73 కోట్లు పక్కదారి పట్టించారు. అంతేకాదు కొనుగోలు చేసిన ధాన్యానికి సుమారు రూ.100కోట్ల వరకు చెల్లింపులే చేయలేదు.
- తిత్లీ తుపాన్ బీభత్సానికి జిల్లాలో 52,164 మంది కొబ్బరి రైతులు, 78,108మంది జీడి రైతులు నష్టపోయినట్టు గుర్తించారు. అర్హులను పక్కన పెట్టి టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే పరిహారం అందజేశారు.
- రైతు రథం కింద మంజూరు చేసిన ట్రాక్టర్లను టీడీపీ బినామీలకు కట్టబెట్టి దోచుకున్నారు.
- జల సంరక్షణ కోసం ఐదేళ్ల కాలంలో రూ.1026.19 కోట్లు ఖర్చు చేసినట్టు రికార్డుల్లో చూపించారు. కానీ, క్షేత్రస్థాయిలో పనులు జరగలేదు.

అన్నదాతలకు అండగా రైతు భరోసా కేంద్రాలు



రైతు భరోసా కేంద్రాలు అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. జిల్లాలో 642 కేంద్రాల ద్వారా సేవలు అందుతున్నాయి. వ్యవసాయానికి సంబంధించి ఎలాంటి సమస్య వచ్చినా తక్షణం పరిష్కరిస్తూ.. ఉపయుక్తమైన సలహాలు అందజేస్తూ రైతుకు సాయపడుతున్నాయి. గతంలో చాలా తక్కువ మందికి సబ్సిడీ విత్తనాలు అందేవి. ప్రస్తుతం ఆర్‌బీకేల ద్వారా రైతులకు నేరుగా అందుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభానికి ముందే ఎవరెవరికి ఎన్ని బస్తాల విత్తనాలు కావాలో ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. మూడు రోజుల్లో రైతుల ఇళ్లకే విత్తనాలు అందజేస్తున్నారు. కావాల్సిన ఎరువులను కూడా ముందుగానే ప్రతిపాదనలు తీసుకుని అందించారు. కూరగాయల రైతులు కియోస్కుల ద్వారా పురుగుల మందులు, ఎరువులు బుక్ చేసుకుంటున్నారు. కష్టపడి సాగు చేస్తున్న పంట వివరాలను క్షుణ్ణంగా తెలుసుకోవడానికి, ప్రభుత్వ అందించే ప్రయోజనాలు పొందడానికి పంటల ఈ క్రాప్‌ను ఆర్‌బీకే స్థాయిలోనే చేశారు. పరీక్షల కోసం 7 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

- వైఎస్సార్ రైతుభరోసా కింద 3.21లక్షల మంది రైతులకు గాను రూ.1919.46కోట్లు అందించారు.
- వైఎస్సార్ ఉచిత పంటల భీమా కింద 87,158 రైతులకు గాను రూ 85.14కోట్లు అందజేశారు.
- రూ. 424.74కోట్లతో 2,89,197 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందజేశారు.
- 82,745 మెట్రిక్ టన్నులు ఎరువులు (యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకే) పురుగు మందులు 5592 లీటర్లు నానో యూరి యా వంటివి ఆర్‌బీకేల ద్వారా అందించారు.
- వైఎస్సార్ యంత్ర సేవాపథకంలో 505 ట్రాక్టర్లు, మల్టిపుల్‌క్రాప్ త్రెసర్స్, పాడిరేపర్స్, రోటావెటర్స్ అందజేశారు.
- సీసీఆర్‌సీ కార్డులు 27,049 కార్డులు అందించారు.
- రైతులకు సున్నా వడ్డీ రుణాలు అందించారు.
- తిత్లీ తుపాను సమయంలో నష్టపోయిన వారికి ఏకంగా ఒక్కో చెట్టుకు రూ.3000, జీడి తోటలకు హెక్టార్‌కు రూ.50 వేలు మంజూరు చేశారు
- 2017–18 రబీ సీజన్‌లో మొక్కజొన్న పండించిన రైతులు గిట్టుబాటు ధర లేదని ప్రభుత్వం క్వింటాకు రూ.200 బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. 15,915మందికి రూ.11.17కోట్లు మేర లబ్ధి చేకూర్చారు.

పలాస కిడ్నీ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



ఆపరేషన్ అనంతరం గొబ్బక చంద్రవతితో వైద్యులు

కాశీబుగ్గ: పలాస కిడ్నీ పరిశోధన కేంద్రంలో బుధవారం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. లావేరు మండలం పాతకుంకాం గ్రామానికి చెందిన 69 ఏళ్ల గొబ్బక చంద్రవతికి కాలిపై గాయమైంది. సుగర్ వ్యాధి ఉండడంతో కాలిని తీసేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆమె ఈ నెల 6న ఆస్పత్రికి వచ్చారు. ఆమెకు కాలు తీయకుండా ప్రత్యేక చికిత్సను అందజేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ తెలిపారు. రోగికి వివిధ రక్త పరీక్షలు చేయించి కాలికి సంబంధించిన రక్తనాళాల్లో సమస్యను గుర్తించి వైద్యం అందించామన్నారు. కాలు తీసేయాల్సిన పరిస్థితి ఉండడంతో సూపర్ స్పెషాలిటీ డాక్టర్లు డాక్టర్ ఎ.కిశోర్‌కుమార్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ సందీప్‌రాజు, డాక్టర్ అనుషా రక్తనాళాలకు బైపాస్ సర్జరీ చేసి కాలు తీసేయాల్సిన అవసరం లేకుండా చేశారు. ప్రస్తుతం బాధితురాలు కోలుకుంటున్నారు. రక్తనాళాలలో అద్భుతొలగి తిరిగి రక్త ప్రసరణ జరుగుతోందని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ చేసిన వైద్యులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ అభినందించారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ



కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఆయన బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈవీఎమ్స్ హేండ్స్ ఆన్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రిసెప్షన్ సెంటర్ శివాని కాలేజీలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 17 అంశాలతో కూడిన ఫార్మేట్ ఉంటుందన్నారు. పోలింగ్ మెటీరియల్ పూర్తిస్థాయిలో తీసుకున్న ది చెక్ లిస్ట్ ద్వారా పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ మాట్లాడుతూ సెక్టోరియల్ అధికారులు పోలింగ్ రోజున అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన రిపోర్టులను ఎన్నికల కంట్రోల్ రూమ్‌కు నియమావళి ప్రకారం అందజేయాలని సూచించారు. ఏదైనా పోలింగ్ కేంద్రంలో సమస్యలు ఉంటే తక్షణమే స్పందించి పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలలో సమస్య ఉత్పన్నమైతే సెక్టోరియల్ అధికారులు తమ వద్దనున్న రిజర్వ్ పరికరాలతో భర్తీ చేయాలని తెలిపారు.

● ఓటే మన ఆయుధం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్యకారిణి నీరజ సుబ్రహ్మణ్యం తన శిష్యబృందంతో శ్రీకాకుళంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. - శ్రీకాకుళం అర్బన్

క్లుప్తంగా

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి


వేదికపై చైర్‌పర్సన్ సత్యనారాయణ తదితరులు

టెక్కలి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ అన్నారు. బుధవారం టెక్కలి విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1912 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా సమస్యలు తెలియజేయవచ్చన్నారు. 2005 నుంచి ఇప్పటి వరకు సుమారు 7823 సమస్యలు పరిష్కరించినట్లు వివరించారు. అనంతరం ఐదు ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ ఆర్థిక సభ్యుడు ఎం.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అటెండర్‌పై సస్పెన్షన్ వేటు

అరసవల్లి: నగరంలోని దేవదాయ శాఖ పరిధిలోని ఉమారుద్ర కోటేశ్వర ఆలయ అటెండర్‌గా పనిచేస్తున్న వి.సతీష్‌ను ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తూ (రిమూవల్ ఆర్డర్) ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో ఎం.సుకన్య తెలిపారు. ఆమె బుధవారం 'సాక్షి'తో మాట్లాడుతూ ఉపాలయంగా ఉన్న ఆంజనేయ స్వామి వారి ఆలయ భూముల నుంచి రెండేళ్లకు గాను ఏడుగురు రైతుల నుంచి రూ.2,16,800 శిస్తులను, ఉమారుద్రకోటేశ్వర ఆలయానికి చెందిన ఓ భూమి నుంచి రూ.3600 కలిపి మొత్తం రూ.2,20,400 నగదును నకిలీ రశీదులతో అటెండర్ సతీష్ వసూలు చేసినట్లుగా నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో ఉన్నతాధికారులతో సంప్రదించి దేవదాయ చట్ట నిబంధనల ప్రకారం అతడిని ఉద్యోగం నుంచి తొలిగించామని ప్రకటించారు. ఆలయానికి చెందిన 14.70 ఎకరాల భూముల నుంచి కొన్నాళ్లుగా శిస్తు వసూళ్ల లెక్కలేవీ డీసీబీ రికార్డులో నమోదు కాలేదని, ఈ అక్రమ వసూళ్లపై వన్‌టౌన్‌లో సతీష్‌పై ఫిర్యాదు చేయనున్నామని, తదుపరి విచారణ జరిగితే మరిన్ని వాస్తవాలు బయటపడే అవకాశాలున్నాయని చెప్పారు.

అసలు పాత్రధారునిపై ఆరా..!


ఉపాలయాల ఆదాయాన్ని గండి కొట్టిన అక్రమాల్లో అసలు పాత్రధారుడెవరో తేల్చేందుకు దేవదాయ శాఖ ఆరా తీస్తోంది. గతంలో ఈ ఆలయానికి ఈవోగా పనిచేసిన ఓ అధికారి అండదండలతోనే అటెండర్ సతీష్ ఇలా నకిలీ రశీదులు, నకిలీ దర్శన టిక్కెట్ల విక్రయాల వంటి అక్రమాలకు పాల్పడ్డాడని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారు.

ప్రాణం తీసిన ఈత సరదా


బాలమాధురి (ఫైల్)

హిరమండలం: వంశధార నదిలో స్నానానికి దిగి ముగ్గురు బాలికలు మునిగిపోయారు. స్థానికులు గమనించి బయటకు తీసేలోపే అందులో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. హిరమండలం మేజర్ పంచాయతీ పాత హిరమండలంలోని కుమ్మరివీధికి చెందిన బాలమధురి(14) వీధిలోని ఇద్దరు స్నేహితులతో కలిసి వంశధార నదిలో స్నానానికి వెళ్లింది. స్నానం చేస్తుండగా మాధురి మునిగిపోయింది. ఆమెను కాపాడే క్రమంలో ఇద్దరు స్నేహితులు సైతం మునిగిపోయారు. కేకలు వేయడంతో స్థానికులు పరుగున వచ్చి ముగ్గుర్నీ బయటకు తీశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలమాధురి మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మాధురి తల్లిదండ్రులు రోజువారి కూలీలు. వీరికి మాధురితో పాటు కుమారుడు ఉన్నాడు. మాధురి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి సింహాద్రి ఫిర్యాదు మేరకు ఎస్సై జి.నారాయణ స్వామి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు.

స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాల పరిశీలన


స్ట్రాంగ్ రూంలు పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల ఈవీఎంలు భద్రపరిచేందుకు చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పరిశీలించారు. పార్లమెంట్, శాసనసభ నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రశాంతంగా కౌంటింగ్ కొనసాగేందుకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా, నియోజకవర్గాలు రిటరింగ్ అధికారులు పాల్గొన్నారు.


- అందుబాటులో అపారమైన జల వనరులు
- టూరిజం, ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి
- పేదల ఊటీగా ప్రత్యేక గుర్తింపు
- స్వాతంత్ర సమరంలో సిక్కోలుకు స్థానం
- ఉద్దండులను చట్టసభలకు పంపిన ఘనత

మెళియాపుట్టిలోని వైఎస్సార్ సుజలధార నీటిశుద్ధి కేంద్రం


పార్లమెంట్ **శ్రీకాకుళం** ముఖచిత్రం

శ్రీకాకుళం.. వైరుధ్యాలకు ఆలవాలం

అటు వైపు ఉద్యమ నినాదాలు.. ఇటు వైపు శాంతి ప్రవచనాలు. ఓ వైపు ఎత్తయిన పర్వతాలు.. మరోవైపు లోతైన నదులు.. విస్తారమైన పంట క్షేత్రాలు, విశాలమైన సముద్ర తీరాలు.. నుదుటన వెనుకబాటు ముద్ర.. చేతిలో కష్టపడే విద్య.. ఇలా అనంత వైరుధ్యాలకు నిలయం శ్రీకాకుళం. స్వాతంత్ర్య సమయం నుంచి తన ప్రస్థానాన్ని విశిష్ట రీతిలో చాటుకుంటున్న ఈ గడ్డ ఇప్పుడిప్పుడే ప్రగతి దిశగా అడుగులు వేస్తోంది. కొత్త కొత్త ప్రాజెక్టులతో రేపటిపై ఆశలు రేపుతోంది.



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఉద్యమాలకు పురిటిగడ్డ, హక్కుల కోసం పోరాటం నేర్పిన నేలగా పేరుగాంచిన సిక్కోలు దశాబ్దాలుగా వెనకబడిన ప్రాంతంగా మిగిలి పోయింది. రాజకీయ ఉద్దండులను చట్టసభలకు పంపించిన ప్రాంతానికి రాజకీయంగా ఎంతో చరిత్ర ఉంది. బొడ్డేపల్లి రాజగోపాలరావు, గౌతు లచ్చన్న, హనుమంతు అప్పయ్యదొర, కణితి విశ్వనాథం, ధర్మాన ప్రసాదరావు, తమ్మినేని సీతారాం, కింజరాపు ఎర్రన్నాయుడు తదితర ప్రముఖ నాయకులు ఈ గడ్డ నుంచే చట్టసభలకు వెళ్లారు. శ్రీకాకుళం పార్లమెంట్‌లో భిన్నమైన పరిస్థితులు ఉంటాయి.

అపారమైన జలవనరులు ఉన్నాయి. వేసవిలో కూడా చల్లగా ఉండే ప్రాంతం కావడంతో పేదల ఊటీగా పేరుంది. పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా బతుకులు మారలేదని ఇక్కడ ప్రజలు అనుకునేవారు. అయితే వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంలో, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో అభివృద్ధి అడుగులు పడ్డాయి. ఎన్నడూ చూడని అభివృద్ధిని వీరిద్దరి పాలనలోనే ఇక్కడి ప్రజలు చూస్తున్నారు.

శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఓటర్ల వివరాలు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఇచ్ఛాపురం	130751	137434	17	268202
పలాస	107278	112049	21	219348
టెక్కలి	117816	118502	09	236327
పాతపట్నం	112367	112936	10	225313
శ్రీకాకుళం	135301	137928	31	273260
ఆమదాలవలస	96179	97664	15	193858
నరసన్నపేట	107103	107750	13	214866

అభివృద్ధి మంత్రం..



- ✔ శ్రీకాకుళంలో రిమ్స్ మెడికల్ కళాశాల
- ✔ ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీ
- ✔ మూలపేట పోర్టు(నిర్మాణంలో ఉంది)
- ✔ ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు(వైఎస్ జగన్ హయాంలో)
- ✔ పలాసలో కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రి (వైఎస్ జగన్ హయాంలో)
- ✔ బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్(నిర్మాణంలో ఉంది)
- ✔ వంశధార ప్రాజెక్టు (నిర్మాణంలో ఉంది)
- ✔ వంశధార లిఫ్ట్ ఇరిగేషన్(వైఎస్ జగన్ హయాంలో నిర్మాణం
- ✔ ఆఫ్‌షోర్ ప్రాజెక్టు(నిర్మాణంలో ఉంది)
- ✔ ట్రిపుల్ ఐటీ(వైఎస్ జగన్ హయాంలో పక్కా భవనాలు)
- ✔ వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల(వైఎస్ జగన్ హయాంలో ఏర్పాటు)
- ✔ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాల (వైఎస్ జగన్ హయాంలో ఏర్పాటు)
- ✔ పెద్దపేట హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్

72 ఏళ్ల చరిత్ర

మద్రాసు రాష్ట్రంలో ఉండగా 1952లో శ్రీకాకుళం పార్లమెంట్ ఎన్నికల ప్రస్థానం మొదలైంది. తొలి ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా బొడ్డేపల్లి రాజగోపాలరావు ఎన్నికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అదే పేరుతో లోకసభగా కొనసాగింది. 1957లో జరిగిన తొలి ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ తరఫున బొడ్డేపల్లి రాజగోపాలరావు ఎన్నికయ్యారు. ఇప్పటివరకు 17 సార్లు పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పేరాడ తిలక్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు.

గ్రామ సచివాలయాలు : **835** | రైతు భరోసా కేంద్రాలు : **656** | వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు : **544** | డిజిటల్ లైబ్రరీలు : **117** | ఎంఎస్ఎంఈలు : **5,538** (జగన్ హయాంలో ఏర్పాటైనవి) | జిల్లాలో ఉన్న మొత్తం పరిశ్రమలు: **12,057**

ఎందరో మహానుభావులు..

స్వాతంత్ర్య పోరాటంలో మన జిల్లా నుంచి ఎంతో మంది పాల్గొన్నారు. వివిధ ఉద్యమాల్లో పాల్గొని స్వాతంత్ర్యం రాకలో భాగస్వామ్యమయ్యారు. వారిలో గరిమెళ్ల సత్యనారాయణ, గౌతు లచ్చన్న, చౌదరి సత్యనారాయణ, మార్పు పద్మనాభం, వీరగున్నమ్మ, స్వామిబాబు పొట్నూరు తదితర ప్రముఖులు ఉన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ ప్రత్యేకతలు..



రాష్ట్రంలో అత్యంత పొడవైన తీరరేఖ ఈ జిల్లాలోనే ఉంది. 193 కిలోమీటర్ల మేర విస్తరించిన తీరంలో చెప్పుకోదగ్గ పర్యాటకులు విహరించడానికి అనువైన ప్రదేశాలు ఉన్నాయి. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే నదీ-సాగర సంగమాలు అటు అందాలతో, ఇటు దేవాలయాలు ఆధ్యాత్మిక శోభతో ప్రకాశిస్తున్నాయి. పార్లమెంట్ పరిధిలో అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం వంటి ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాలెన్నో ఉన్నాయి. రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి భక్తులు తరలివస్తారు. శ్రీకాకుళం జిల్లాలో మరో ప్రముఖ బౌద్ధ కేంద్రం దంతవరపుకోట ఉంది. బౌద్ధులు విశిష్టమైనదిగా పరిగణించే శాలిహుండం అనే ప్రదేశం ఇక్కడుంది. శాలిహుండం కొండ పక్కగా వంశధార నది ప్రవహిస్తూ ఉంటుంది. కొండపైనుంచి చూస్తే వంశధార నది కళింగపట్నం వద్ద బంగాళాఖాతంలో కలిసే దృశ్యం లీలగా గోచరిస్తుంది. బారువలో ప్రసిద్ధి చెందిన కోటిలింగేశ్వర స్వామి ఆలయం, జనార్దనస్వామి ఆలయం ఉన్నాయి. తేలినీలాపురంలో సైబీరియన్ కొంగల విహారకేంద్రం ఉంది. ఇచ్ఛాపురం పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న తేలుకుంచి గ్రామం విదేశీ పక్షుల విడిది కేంద్రంగా గుర్తింపు పొందింది. ప్రఖ్యాత నటుడు అక్కినేని నాగేశ్వరరావు నాణ్యతకూ, మన్నికకూ పేరుపొందిన పొందూరు ఖద్దరు పంచెలనే ధరించేవారు. ఈ ఖాదీ కేంద్రాన్ని సందర్శించిన ప్రముఖులలో మహాత్మా గాంధీ కుమారుడు దేవదాసు గాంధీ తదితరులు ఉన్నారు.

ఆస్తులు ఇచ్చేది జగన్.. లాక్కునేది చంద్రబాబు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: నమ్మక ద్రోహమే పరమావధిగా ఉన్న పార్టీ తెలుగుదేశం కాగా, విశ్వసనీయతకు విలువలిచ్చే పార్టీ వైఎస్సార్ సీపీ అని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని వెంకటాపురం, నైరా తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ పొరపాటున చంద్రబాబుకు అధికారం కట్టబెడితే పథకాల పేరిట ప్రజాధనం లూటీ కావడం తప్ప ప్రజలకు ఒరిగేది లేదన్నారు. ఎల్లో మీడియా ఇటీవల ప్రజలను మభ్యపెట్టి విషప్రచారాలకు పూనుకుందన్నారు. సీఎం జగన్ భూములు లాక్కునేవారైతే జగనన్న కాలనీల కింద 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఎందుకు పంచుతారని ప్రశ్నించారు. ఇటీవల నిర్వహించిన కూటమి సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ పేదల భూముల రక్షణకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రతిపాదించామని చెప్పారని గుర్తు చేశారు. ఎంతమంది ఏకమైనా వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరని ధర్మాన స్పష్టం చేశారు.

రిటైర్డు హోంగార్డుకు చెక్ అందజేత


ఉమామహేశ్వరరావుకు చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తూ గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు యు.ఉమామహేశ్వరరావుకు హోంగార్డుల ఒక్క రోజు వేతనం రూ.4.18 లక్షలను ఎస్పీ జి.ఆర్.రాధిక అందజేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం చెక్ అందించారు.

వైఎస్సార్ సీపీ వెంటే కాళింగ సామాజికవర్గం


సమావేశంలో మాట్లాడుతున్న కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కాళింగ సామాజికవర్గమంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు(లక్ష్మణరావు) అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరిగానే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలో కాళింగ సామాజిక వర్గం బలాన్ని గుర్తించి జిల్లాలో ప్రస్తుతం ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యే అభ్యర్థులకు పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. 2019లో మూడు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ప్రకటించినప్పటికీ స్వల్ప తేడాతో ఓడినప్పటికీ, ఒకరికి ఎమ్మెల్సీగా, ఒకరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, ఒకరికి రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారన్నారు. తమ్మినేని సీతారాంను స్పీకర్‌గా నియమించి అత్యున్నత పదవిని అందించి సామాజిక వర్గానికి గౌరవించారని గుర్తు చేశారు. కాళింగ సామాజిక వర్గానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి జిల్లాకు చైర్మన్‌ను నియమించడం గొప్ప విషయమన్నారు. సీఎం జగన్‌కు అండగా నిలిచి వైఎస్సార్‌సీపీ గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాడాన కృష్ణారావు, పప్పల రాధాకృష్ణ, తమ్మినేని మురళి, తమ్మినేని వాసుదేవరావు, బొడ్డేపల్లి గంగాధర్, గురుగుబిల్లి లక్ష్మణరావు, మొదలవలస పాపారావు, గురుగుబెల్లి కృష్ణారావు, మెట్ట శ్యామలరావు, కూన సత్తిబాబు, దుంపల గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికల జోష్


కోటబొమ్మాళి: మాజీ వలంటీర్లను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న మారిటోరియం బోర్డు చైర్మన్ కాయలవెంకటరెడ్డి


కాశీబుగ్గ: మంత్రి సీదిరి అప్పలరాజుతో గంగువాడ నాయకులు


కొత్తూరు: పార్టీలో చేరిన మదనాపురం గ్రామస్తులతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి


ఆమదాలవలస: పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం


కొత్తూరు: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో రాజీనామా చేసిన 370 మంది గ్రామ వలంటీర్లు మారిటోరియం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి, ఎంపీగా తిలక్, టెక్కలి ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్‌లను గెలిపించేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు, మండల పార్టీ కన్వీనర్ నూక సత్యరాజు, కలింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, నాయకులు అన్నెపు రామారావు, రోణంకి మల్లయ్య, దుక్క రామకృష్ణ, మండల విప్ బొడ్డు అప్పన్న, ఏఎంసీ వైస్‌చైర్మన్ బొడ్డు వెంకటరమణ, సర్పంచ్‌లు బమ్మిడి గణపతి, కాల్ల సంజీవరావు, సుంకరి జనార్దన, ఎస్.వి.రమణమూర్తి, తలగాన గణపతి తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: పలాస మండలం కేదారిపురం పంచాయతీ గంగువాడకు చెందిన మాజీ డీసీసీబీ అధ్యక్షుడు సిర్ల బుజ్జి ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి సీదిరి అప్పలరాజు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మామిడి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


నందిగాం: హరిదాసుపురంలో పార్టీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

కొత్తూరు: మండలంలోని లబ్బ, గొట్టిపల్లి పంచాయితీ దాపాకులగూడ గిరిజన గ్రామాలకు చెందిన 35 కుటుంబాలు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నిమ్మ జోగారావు, మండా రామకృష్ణ, సురేష్, సవర భాస్కరరావు, నగేష్, సవర చిన్నోడు ఉన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, సాధుబాబు పాల్గొన్నారు.

కొత్తూరు: మదనాపురం గ్రామానికి చెందిన జన్ని భారతి, బాణాల ధనలక్ష్మి, సీతంనాయుడు, ఆగతమూడి చలపతిరావు, పెయ్యల పార్వతీశం, మాలువ ప్రభావతి, పెద్దింటి రాణి, మంగమ్మ, డిల్లేశ్వరి, అప్పారావు, జన్నోడి ఆదినారాయణ, కాంతమ్మ తదితరులు ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైఎస్సార్ సీపీ చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంచాడ వెంకటరమణ పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని హరిదాసుపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన 20 కుటుంబాలు స్థానిక నాయకుడు కణితి నారాయణమూర్తి, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఉప సర్పంచ్ కణితి నారాయణరావు, రామారావు, వినోద్ కుమార్, చక్రధర్, ఆనందరావు చౌదరి, వినోద్ చౌదరి, మోహనరావు, సింగూరు రామారావు, గురువెల్లి బలరాం, పొందర పాపారావు, నర్సిపురం వినోద్, నర్సిపురం రాజు, రాజాం డొంబూరు, పినకాన జోగులు,మెట్ట పున్నయ్య, జొన్నాడ శివ, బమ్మిడి గణపతి ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, కవిటి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

జి.సిగడాం: లావేరు మండలం వెంకటాపురం, లింగాలవలస గ్రామాలకు టీడీపీ నేతలు పిన్నింటి సత్యం, పిన్నింటి సూర్యారావులతోపాటు మరో 25 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే సతీమణి గొర్లె పరిమళ, విజయనగరం ఎంపీ సతీమణి బెల్లాన శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిన్నారావు, మాజీ సర్పంచ్ నడిమింటి కుమారి సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీలు మీసాల సత్యవతి, పిన్నింటి రజని పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని కుంచాడపేటకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూరగాంకు చెందిన 20 కుటుంబాలు టీడీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. పార్టీలో చేరిన వారిలో మజ్జి లక్ష్మినారాయణ, సున్నాపురం నందీస్, మాకివలస దండాసీ, కొంచాడి పండు, దొర పారయ్య, దొర జగన్, కొంచాడి సోమేశ్వరరావు, చింతపల్లి వంశీ, ముకుందపురం అశోక్, చింతపల్లి ధర్మారావు, చింతపల్లి వంశీ, మాలువ అప్పన్న, జన్ని ఇంజాద్రి, అప్పారావు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.అప్పన్న, వైఎస్సార్ సీసీ నాయకులు చీకటి పద్మరాజు, గార కాంతరావు, ఏనుతల హేమ సుందరరావు, సురవరపు రమణ మూర్తి పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు, ఎరుకులపేట, కృష్ణాపురం గ్రామాలకు చెందిన 100 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఆమదాలవలస ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని సీతారాం పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దన్నాన సూరిబాబు, గార హరిబాబు, దీన ప్రసాద్, జరజాపు మణికంఠ, అనకాపల్లి దేవ, అనకాపల్లి రాము, గాడు గన్నెయ్య, సతీష్, నాగరాజు ఉన్నారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు(రామారావు), మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, కోట గోవిందరావు, గుడ్ల మోహన్, వండాన సూరప్పనాయుడు, పప్పల రాధాక్రిష్ణ, అనకాపల్లి గోవింద, అనకాపల్లి రామకృష్ణ, కొన్న సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


జి.సిగడాం: వైఎస్సార్ సీపీలో చేరిన వారితో నాయకులు


పాతపట్నం: కొంచాడపేట గ్రామస్తులకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

క్లుప్తంగా

సజావుగా ఏపీ ఈసెట్



విద్యార్థుల హాల్ టిక్కెట్లు శివానీలో పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈసెట్–2024 ఆన్‌లైన్ పరీక్ష బుధవారం సజావుగా జరిగింది. చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100కి 90 మంది, రెండో షిఫ్ట్‌లో 100 కి 99 మంది, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్ట్‌లో 100 కి 98, రెండో షిఫ్ట్‌లో 100 కి 95 మంది హాజరయ్యారు. మొత్తం 400 మందికి రెండు పరీక్ష కేంద్రాలను కేటాయించగా, 382 మంది హాజరయ్యారు. ప్రత్యేక పరిశీలకులు పరీక్ష పర్యవేక్షించారు.

టెన్త్ ఫెయిల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



విద్యార్థులకు సూచనలిస్తున్న డీడీ, డిప్యూటీ ఈఓ, తదితరులు

సీతంపేట: పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, మల్లి బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం నుంచి ప్రత్యేక తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర మాట్లాడుతూ.. ఈ నెల 24 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు ఈ కోచింగ్ ఎంతో దోహదపడుతుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో సబ్జెక్టులను బోధించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీఈఓ పి.నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీఓ రాములమ్మ, ఉపాధ్యాయులు ఏవీ శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు విస్తృత చర్యలు



సూచనలిస్తున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు

సీతంపేట: మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా విస్తృత చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా మలేరియా నివారణాధికారి జగన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు సీతంపేట మండలంలోని దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించి అక్కడి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ల్యా బ్ రికార్డులు తనిఖీ చేసి, జ్వరాలు ఏ మేరకు నమోదవుతున్నాయో పరిశీలించారు. జ్వర లక్షణాలు న్న వారికి సత్వరమే రక్తపూతలు సేకరించి నివేదికలు తెలియజేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, శిశువుల్లో చిన్న ఆరో గ్య సమస్యలున్నా వెంటనే హైరిస్క్‌గా పరిగణించి తగు చికిత్సలు అందజేయాలని కోరా రు. కిల్కారీ వాయిస్ వినిపించాలని చెప్పారు. రక్తహీనత నివారణపై దృష్టిపెట్టాలని, గ్రామాల్లో డ్రై డే కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, వైద్యాధికారి గిరీష్, సూపర్‌వైజర్ ధమయంతి, గంగమ్మ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్‌మేకింగ్‌లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చేనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వెరిఫికేషన్ చేయించుకున్న వారు మాత్రమే మెరిట్ జాబితాలో ఉంటాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7569062449, 9390063881 ఫోన్ నంబర్లు సంప్రదించాలన్నారు.

పోలింగ్‌లో ఏజెంట్లే కీలకం

● దొంగ ఓటర్లను గుర్తించే అవకాశం



హిరమండలం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ఏజెంట్లది కీలక పాత్ర. పోలింగ్ బూత్‌లో ఉన్న ఏజెంట్లందరూ ఒక్కటైపోతే దొంగ ఓటర్లు సులువుగా ఓటు వేసుకునే అవకాశం ఉంటుంది. అందుకే పార్టీ నాయకులు ఏజెంట్ల ఎంపిక విషయంలో చాలా అప్రమత్తంగా ఉంటారు. ఎవరైతే పార్టీకి విధేయులుగా ఉంటారో వారినే నియమిస్తారు. దొంగ ఓట్లు వేసే వారిని అడ్డుకోవడం, ఒక వేళ దొంగ ఓటు వేయడానికి ఎవరైనా వస్తే వారిని గుర్తించి పోలింగ్ అధికారులకు తెలియజేయడం వంటివి చేస్తుంటారు. ఓటర్లను పోలింగు ఏజెంట్లు గుర్తించిన తర్వాతే ఓటు వేసేందుకు పోలింగు సిబ్బంది అనుమతిస్తారు. వాస్తవంగా ప్రతి పోలింగ్‌స్టేషన్ లోనూ అభ్యర్థుల తరపున ఏజెంట్లను నియమించుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతిస్తుంది. ఇందుకు ముందుస్తుగా వారి వివరాలను ఎన్నికల అధికారులకు అందజేయాలి. ఆ తర్వాత ఎన్నికల అధికారి ఫొటో గుర్తింపు కార్డు ఇస్తారు. గతంలో ఎన్నికల అధికారుల ఫొటోలు లేకుండా గుర్తింపు కార్డులు మంజూరు చేసేవారు. ఒకరి తరపున మరొకరు ఏజెంట్లుగా వ్యవహరించే అవకాశం ఉన్నందున ఎన్నికల అధికారులు ఫొటో గుర్తింపు కార్డులను ఇస్తున్నారు.

నియామకం ఇలా..

ప్రతి అభ్యర్థి తమకు నమ్మకమైన వారికి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో పాటు ఓటరు జాబితాలోని సీరియల్ నంబర్‌ను తీసుకుని ముందుగా పార్టీ కార్యాలయాలకు పంపిస్తారు. అక్కడ నుంచి అనుమతి వచ్చిన తర్వాత ఎన్నికల అధికారులకు ఆ జాబితా అందజేస్తారు. వారి పరిశీలన అనంతరం ఎన్నికల అధికారులు ప్రత్యేకంగా ఏ పోలింగ్ స్టేషన్‌లో ఏజెంటుగా వ్యవహరించాలి.. అనే వివరాలతో గుర్తింపు కార్డులను మంజూరు చేస్తారు. ఒక పోలింగ్ స్టేషన్‌కు సంబంధించిన గుర్తింపు కార్డు పొంది మరో కేంద్రంలో ఏజెంటుగా వ్యవహరించేందుకు అనుమతించరు.

ఎవరు అర్హులంటే..?

- పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి పోలింగ్ కేంద్రంలో గానీ ఆ పరిధిలో ఉంటే గ్రామంలో గానీ ఓటరై ఉండాలి.
- ఓటు హక్కు లేని వారిని నియమించరు.
- పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడానికి వచ్చే వారిని గుర్తించేందుకు మాత్రమే ఏజెంట్లను నియమిస్తారు. అంతేకానీ వారికి ఎలాంటి అధికారాలు ఉండవు.
- పోలింగ్ ఏజెంటుగా ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఎలాంటి ప్రచారం చేయకూడదు.
- ఏదైనా పార్టీ తరపున కేంద్రంలో ప్రచారం చేస్తున్నట్లు పోలింగ్ సిబ్బంది గమనిస్తే ముందుగా హెచ్చరించిన తరువాత బయటకు పంపిస్తారు.
- ప్రతి పోలింగ్ కేంద్రంలో ఒక అభ్యర్థికి ఇద్దరు చొప్పున ఏజెంట్లును నియమించుకునే వీలుంది.
- ఇద్దరు ఏజెంట్లు ఒకేసారి ఉండేందుకు అనుమతించరు.
- లోక్‌సభ అభ్యర్థి తరఫున ఇద్దరు, అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి తరఫున ఇద్దరు చొప్పున ఏజెంట్లను నియమిస్తారు.
- ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాలను చూడాల్సి ఉంది.

సారా స్థావరాలపై పోలీసుల దాడులు



సవరకుడ్డబ గ్రామంలో సారా ఊటలు ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని సవర కుడ్డబ గ్రామంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సమన్వయంతో బుధవారం సారా తయారీ స్థావరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో 1100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారాని స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిపై కేసునమోదు చేశారు. శ్రీకాకుళం ఎస్ఈబీ జేడీ గంగాధరం సూచనల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. దాడుల అనంతరం అయా గ్రామాల ప్రజలకు నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పలాస డీటీఎఫ్ సీఐ, రామచంద్ర కుమార్, టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు, పలువురు సిబ్బంది ఉన్నారు.

'నిఘా మరింత పెంచాలి'



కొత్తూరు మండలం కర్లెమ్మ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న గంగాధర్

కొత్తూరు: ఎన్నికలు సమీపిస్తున్నందున చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత పెంచాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ గంగాధర్ అన్నారు. ఆయన కొత్తూరు మండలం కర్లెమ్మ అంతర్ జిల్లా చెక్‌పోస్టును బుధవారం రాత్రి తనిఖీ చేశారు. ఎన్నికలు దగ్గరలో ఉన్నందున నగదు, మద్యం వంటివి అక్రమంగా రవాణ జరిగే అవకాశం ఉందని, సెబ్ స్టేషన్ సిబ్బంది, మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. తనిఖీల్లో స్థానిక సీఐ జమరామరెడ్డి, ఎస్ఐ శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

తలసేమియా బాధితులను ఆదుకుందాం



రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలిచేందుకు ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ బి.దేవభూషన్, కోశాధికారి శిల్లా మణి కోరారు. ప్రపంచ తలసేమియా దినం సందర్భంగా బుధవారం నగరంలోని లయన్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు మేనేజర్ కె.సునీల్, రవి, సాహు, దాతలు ఈ.నాగరాజు, జి.సురేష్‌కుమార్, ఎస్.సత్యనారాయణ, బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు నేడు చివరి అవకాశం

శ్రీకాకుళం పాత బస్టాండ్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు గురువారం చివరి అవకాశాన్ని కల్పిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. గడిచిన నాలుగు రోజులుగా జిల్లాలో 41,225 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఆయా ఫెసిలియేషన్ సెంటర్లలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇంకా ఓటు హక్కు వినియోగించుకోని ఉద్యోగులు గురువారం ఒక్కరోజు చివరి అవకాశంగా తమ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కచ్చితంగా వినియోగించుకొనేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఆటోబోల్తా: నలుగురికి గాయాలు

సీతంపేట:

మండలంలోని జజ్జువ సమీపంలో బుధవారం ఆటో బోల్తాపడడంతో జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. తమ గ్రామం నుంచి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకోవడానికి పాలకొండకు ఆటోలో వస్తుండగా మార్గమధ్యంలో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నిమ్మక మాణిక్యం, నారాయణమ్మ, సవర సూరయ్య, రామారావులకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పాలకొండ ఒకరిని, శ్రీకాకుళం రిమ్స్‌కు మ రొకరిని రిఫర్ చేశారు. మిగతా ఇద్దరు కోలుకున్నట్లు ఏఎస్సై సంజీవరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

రెండో పెళ్లికి సిద్ధపడిన కొడుకు!

● పోలీసులకు అప్పగించిన తండ్రి



కొడుకుని పోలీసుస్టేషన్‌కు ఈడ్చుకెళ్తున్న తండ్రి

భువనేశ్వర్: ఇంట్లో తాళి కట్టిన ఇల్లాలు ఉండగా మరో మహిళతో రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు ఆ మృగాడు. అయితే దీన్ని తండ్రి అంగీకరించలేదు. కొడుకుని ఈడ్చుకొని తీసుకొని వెళ్లి స్వయంగా పోలీసులకు అప్పగించాడు. భద్రక్ జిల్లాలో చోటు చేసుకున్న ఈ సంఘటన చర్చనీయాంశమైంది. ఠాణాలో పెళ్లి తప్పిన దంపతుల్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. తన కొడుకు అజయ్‌ను రెండో పెళ్లి చేసుకున్నందుకు శిక్షగా ఊరేగింపులో కనిపించిన వద్దుడు ప్రజల హృదయాలను గెలుచుకున్నాడు. భద్రక్ జిల్లాలోని బాసుదేవ్‌పూర్ ఠాణా పరిధిలోని ఎడ్తాల్ గ్రామస్థుడు అజయ్ మొదటి భార్య ఉండగా చట్టబద్ధంగా కోర్టులో మరో మహిళతో రెండో పెళ్లికి సిద్ధం అయ్యాడు. ఈ విషయం తన కన్న తండ్రి బిష్ణుమోహన్ జెనా చెవిన పడడంతో హుటాహుటిన కొడుకు రెండో పెళ్లి ప్రాంగణానికి చేరి విషయంపై ఆరా తీశాడు. తాను విన్నది నిజమేనని తేలడంతో కోర్టు ఆవరణ నుంచి కన్న కొడుకు చొక్కా కాలరు పట్టుకుని ఈడ్చుకుంటు నడి రోడ్డు గుండా పోలీసు ఠాణాలో హాజరు పరిచాడు. పది సంవత్సరాల కిందట తన కొడుకు అజయ్‌కు వివాహం జరిగిందని.. ఈ దంపతులకు ఎనిమిదేళ్ల కుమారుడు ఉన్నాడని పోలీసులకు వివరించాడు. ఇల్లాలు, బిడ్డ ఉండగా రెండో పెళ్లికి పాల్పడడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన తండ్రి తక్షణ స్పందన అందరి హృదయాల్ని చలింప జేసింది. కోడలు, మనవడుతో కలిసి ఆరోగ్య పరీక్షల కోసం గ్రామంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) వెళ్లిన సమయంలో కొడుకు కోర్టులో అజయ్‌కు రెండో పెళ్లి జరుగుతుందని తండ్రి చెవిన పడింది. తక్షణమే బిష్ణుమోహన్ తన కోడలు, మనవడిని ఇంట్లో వదిలేసి కోర్టుకెళ్లి రెండో పెళ్లికి సిద్ధమవుతున్న కొడుకును చూసి అవాక్కయ్యాడు. ఈ విషయం దాచిపెట్టకుండా తన కొడుకును పోలీసులకు అప్పగించాలని బిష్ణుమోహన్ అప్పటికప్పుడే నిర్ణయించుకున్నాడు. కొడుకును ఈడ్చుకుని పోలీస్ స్టేషకు తీసుకెళ్లాడు. అజయ్‌తో పెళ్లి చేసుకోబోతున్న మహిళ అతనితో పాటు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. విచారణ నిమిత్తం పోలీసులు అజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇంతలో అజయ్ తనను శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడని అతని భార్య ఆరోపించింది.

ఘనంగా రెడ్‌క్రాస్ దినోత్సవం



వరల్డ్ రెడ్‌క్రాస్ డేలో పాల్గొన్న సభ్యులు



రక్తదాతకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న హ్యూమన్ రైట్స్ జనరల్ సెక్రటరీ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ మానవ జన్మ, సేవ చేయడానికేనని అన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ తాము చేస్తున్న సేవలకు ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి సాయం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ నిత్యం సేవలందిస్తోంది రెడ్‌క్రాస్ మాత్రమేనని అన్నారు. ఈ సందర్భంగా బ్లడ్ బ్యాంకు ఆవరణలో రక్తదాన శిబిరానికి స్వచ్ఛందంగా 10మంది యువత వచ్చి రక్తదానం చేశారు. అలాగే తలసేమియా పేషెంట్లకు పౌష్టికాహార కిట్లను, డ్రైఫ్రూట్స్ కిట్లను సుమారు 50మందికి అందించారు. తలసేమియాతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులకు ఉచితంగా రక్తనిల్వలను అందించారు. ఆడవారికి సంబంధించి ప్రత్యేక కిట్లు, రిమ్స్ ప్రభుత్వ వైద్యశాలలో రోగుల కుటుంబ సభ్యులు సుమారు ఆరు వందల మందికి టోపీలు, ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు పాడేరు రెడ్‌క్రాస్ బ్లడ్ కేంద్రానికి 20 యూనిట్ల రక్తాన్ని అందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జేసీ–2 పి.రజనీకాంతరావు, ట్రెజరర్ కె.దుర్గా శ్రీనివాస్, సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, పి.శ్రీకాంత్, ఆడిటర్ వి.ఎం.రావు, ఎం.సోమసుందరరావు, బి.సతీష్, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నంలో ఉత్సాహంగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

విజయమే ధ్యేయం

విజయమే ధ్యేయంగా అభ్యర్థులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ ప్రచార వేగాన్ని పెంచుతున్నారు. రోడ్డు షోలు, ర్యాలీలతో ఊళ్లన్నీ చుట్టేస్తున్నారు.



కర్తలిపాలెంలో అభిమానులతో కలిసి హుషారుగా ప్రచారం చేస్తున్న ఇచ్ఛాపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ
సోంపేట



రోడ్‌షోలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్
పొందూరు:



మురపాకలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
ఎచ్చెర్ల



సురవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, తదితరులు
జలుమూరు



మందస మండలం బైరిసారంగపురంలో అవ్వతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
కాశీబుగ్గ:



లింగాలవలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్
టెక్కలి



గూడెంలో ఎన్నికల ప్రచారంలో మంత్రికి గజమాల వేస్తున్న అభిమానులు
శ్రీకాకుళం రూరల్:

'పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనే రావాలి'

కాశీబుగ్గ:

శిష్టకరణాలతో పాటు పేదలందరికీ అన్ని పథకాలు అందాలంటే మళ్లీ వైఎస్ జగన్ ప్రభుత్వమే రావాలని శిష్టకరణ నాయకులు కోరారు. వారు బుధవారం పలాసలో ఎన్నికల ప్రచారంలో భాగంగా శిష్టకరణ కుల పెద్దలను కలిశారు. నాయకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, సదాశివుని కృష్ణ, డబ్బీరు భవానిశంకర్‌లు పలాస అభ్యర్థి సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవితో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థి సీదిరి అప్పలరాజుకు ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అంపలాం వసంతకుమార్, జీఆర్‌జీ నాయుడు, కో ఆప్షన్ సభ్యులు సురేంద్రనారాయణ త్యాడి పాల్గొన్నారు.



మంత్రి సీదిరి సతీమణి శ్రీదేవితో కలిసి ప్రచారంలో పాల్గొన్న శిష్టకరణ సంక్షేమ సంఘ నాయకులు

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్నికలు పూర్తయ్యాక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు తీసుకు వచ్చే వాహనాలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. ఈవీఎంలు స్వీకరించే రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటును చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో బుధవారం పరిశీలించారు. ఎనిమిది నియోజకవర్గాల నుంచి ఈవీఎంలు ఇక్కడకు తరలించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపర్చనున్నట్లు చెప్పారు. ఒకే సారి వాహనాలు వచ్చినా ట్రాఫిక్ సమస్య లేకుండా ఎప్పటి వాహనాలు అప్పుడు అన్‌లోడ్ చేసి స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించనున్నట్లు తెలిపారు. రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్లు, సమీప లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన రోడ్లు, పార్కింగ్ స్థలం పరిశీలించారు. ఆమె వెంట అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, సీఐలు జి.రామచంద్రరావు, ఎం.అవతారం, ఎస్ఐ చిరంజీవి పాల్గొన్నారు.



పార్కింగ్ స్థలం పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక